# ఎల్టీసీ

'మారుతి'

**రాష్ట్రంలో** ఎక్కడికైనా కుటుంబంతో సహా ప్రభుత్వం వారి ఖర్చుపైన విలాస యాత్రకు పోవచ్చునన్న పథకం క్రింద భాగ్య నగరంలో సర్కారు కొలువు చేస్తున్న భూషణం —చూడదగిన ప్రదేశానికెక్కడికయినా వెళ్ళా లనుకున్నాడు.

ఆ విషయం ఇంట్లో ప్రస్తావించి రాష్ట్రంలో ఏదైనా మీ కిష్టమైన పట్టణం పేరు చెప్పమని అడిగాడు.

''బెంగుళూరు'' అన్నది చిన్నమ్మాయి పద్మ.

''మన రాష్ట్రంలోని ఊళ్ళ పేర్లు చెప్పమంటే బెంగుళూరు', మైస్సూరు అంటా వేమిటి'' అని విసుక్కున్నాడు భూషణం.

''తిరుపతి వెళ్ళుదాం?'' అని అడిగింది శ్రీమతి లక్ష్మి.

''లక్షణంగా వెళ్ళుచ్చుకాని యిప్పటికే యే అర డజను సార్లో వెళ్ళి వచ్చాం గదా తిరుపతి సొంత ఖర్చుతో'' అని కొట్టి పారేశాడు భూషణం.

పెద్దమ్మాయి రత్న రాజమండ్రి పోదామంది. సుధాకర్ మద్రాసు చూద్దా మన్నాడు. ఇక వీళ్ళవల్ల తేలే విషయం కాదని నిశ్చయించుకొని వీలుచూసుకొని లైబ్రరీకి వెళ్ళాడు భూషణం. అట్లాసు అడిగి తీసుకొని దక్షిణ భారత దేశపు పటాన్ని చాలాసేపు చూశాడు. చూడగా చూడగా విసుగొచ్చిందే తప్ప సమాధానం దొరకలేదు. బయట కొచ్చి బస్సెక్కి రైలు స్టేషను కెళ్ళి గైడు కొన్నాడు. అందులో చివరన అతికించిన సౌత్ సెంట్రల్ రైల్వే వారి మేపు వైపు పరీక్షగా చూశాడు.

కాకినాడ, అన్నవరం, వాల్తేరు, విజయనగరం, బరంపురం వరసగా చూసుకుంటూ వెళ్ళాడు. దృష్టి పక్కకు మరల్చాడు. హైదరాబాదుకు చాలాదూరంగా ఉత్తరాన ఆదిలాబాదు, సిర్పూర్ కాగజ్‌నగర్, దక్షిణంగా ధర్మవరం, హిందూపూర్, చిత్తూరు, రేణిగుంట ... ఇవేవీ పనికొచ్చేవిగా కనిపించలేదు. మేపు మడిచి పుస్తకంలో పెట్టి కాసేపు ఆలోచించాడు. మళ్ళీ రైల్వే గైడ్ తిరగేశాడు. ''శ్రీకాకుళం పట్టణమున అరసవల్లి క్షేత్రమందు శ్రీ ఛాయా పద్మినీ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని భక్తితో సేవించిన భక్తులకు ఆయురారోగ్య భాగ్యములు కలుగుచున్న దనుట కెన్నియో నిదర్శనములు కలవు'' అన్న ప్రకటన అతన్ని ఆకట్టుకొంది.

దాని క్రిందనే మరో క్షేత్ర మహత్యం ఉన్నది. ''సింహాచల క్షేత్రము వాల్తేరు రైల్వే స్టేషను నుండి 14 కిలోమీటర్లు, సింహాచలం రైల్వే స్టేషను నుండి 5 కిలోమీటర్ల దూరంలో నున్నది. ఇచట ఆరాధ్య దైవము శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారు.''

దాని తరవాత వరుసగా ''శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానము'', ''వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం అన్నవరం'', ''భద్రాచల క్షేత్రంలో శ్రీ సీతారామ లక్ష్మణ దివ్యమూర్తులను దర్శించి తరించండి'' అనీ బాక్సు కట్టిన ప్రకటన చదివాడు.

ఎటూ తేల్చుకోలేక పోయాడు. • టూరిజం డిపార్టుమెంటు వాళ్ళేమయినా దారి చూపిస్తారేమో నని వాళ్ళాఫీసు వెతుక్కు వెళ్ళి అక్కడ ఒక విశాలమైన గదిలో ఫాను క్రింద కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న ఒక అధికారి దగ్గిరి కెళ్ళి తన సమస్యను వివరించాడు భూషణం. ''దానికి సంబంధించిన క్లర్కు శలవులో ఉన్నాడండీ వారం రోజులు పోయిం తర్వాత రండి'' అన్నా డాయన పెద్దగా ఆవులిస్తూ. ఇది పనిగాదని యిదివరకు ఎల్టీసీ మీద వెళ్ళి వచ్చిన సహోద్యోగుల నడిగితే కొంత తేలికగా నిర్ణయించుకో వచ్చు ననుకున్నాడు.

మర్నాడు ఆఫీసు కెళ్ళాక అదేపని చేశాడు. ముందుగా స్టోరుకీపరు కృష్ణారెడ్డి నడిగాడు, ''గురూగారూ! మీరు ఎల్టీసీ మీద క్రిందటి ఏడాది ఫామిలీతో వెళ్ళొచ్చారుగదా! ఎక్కడికి వెళ్ళారు. ఏమిటి సంగతి?'' అని.

కృష్ణారెడ్డి ''అసలు నే నెక్కడికీ వెళ్ళలేదండీ. నాలుగు రోజులు సెలవు పెట్టి హాయిగా ఇంట్లో కూచుని ఆ తర్వాత బిల్లు పెట్టాను'' అన్నాడు.

భూషణానికి అర్థం కాలేదు. అయినా అతన్నడగటం తనదే పొరపాటని సరిపెట్టుకొని పే బిల్లు క్లర్కు శివనాథాన్ని అడిగాడు ''మీకు గుర్తులేదేమో? ఎల్టీసీ మీదనేగా గత సంవత్సరం తిరుపతి వెళ్ళి వచ్చాము. నేను గుండు కూడా చేయించుకొన్నాను. అన్నట్టు అందరికీ ప్రసాదం కూడా పంచానే. మీకు అందలేదా?'' అని ఆఖర్న ఒక ప్రశ్న పారేశాడు.

''అలాగే ఉంటుంది లెండి. నేనే మర్చిపోయా''నని అక్కడి నుంచి కదిలి టి. ఎ. బిల్లు క్లర్కు దగ్గరి కెళ్ళి కూచుని ''ప్రసాదరావుగారూ! ఏమీ లేదు .... నేను వచ్చే నెలలో సకుటుంబంగా ఎల్టీసీ మీద ఎక్కడికైనా వెళ్ళా లనుకుంటున్నాను'' అన్నాడు భూషణం—

''అయితే ఇంకేం ఎప్పుడు వెళ్ళుతారో ఎక్కడికి వెళ్తారో మీ కుటుంబ సభ్యుల వివరాలతో రాసి ఒక అప్లికేషను ఇవ్వండి'' అని సలహా ఇచ్చాడు ప్రసాదరావు.

''అదేనండీ ఎక్కడికెళితే బాగుంటుందో తేల్చుకోలేక మీ రేమయిన చెబుతారేమోనని వచ్చాను.''

''అది మీరు తేల్చుకోవలసిన విషయమండీ. అయినా అడిగారు గనక చెబుతున్నాను. విశాఖ పట్టణం వెళ్ళండి. సముద్రమంటే ఇష్టపడని పిల్లలుండరు. హార్బరు, షిప్‌యార్డు, యూనివర్శిటీ, లైట్‌హావుస్ చూసి రావచ్చు హాయిగా'' అన్నాడు ప్రసాదరావు.

భూషణానికి సలహా నచ్చింది. తన సీటులో కూర్చొని విశాఖ పట్నం రానుపోను ఖర్చులకు ఎంతవుతుందో కాయితం మీద రాశాడు. ఫస్టుక్లాసు టిక్కెట్లు ఐదు — హైదరాబాదు నుండి వాల్తేరుకు అక్కడి నుండి తిరిగి హైదరాబాద్ రావటానికి రెండువేల రూపాయలు షుమారుగా అవుతుంది. భోజనంఖర్చు, అక్కడ తిరగటానికి, హోటలు గది, కాఫీ టిఫిన్లకు పైన హీనపక్షం నాలుగొందలు. అందులో ప్రభుత్వం వారు ఇచ్చేది రానుపోనూ రైలు చార్జీలు మాత్రమే.

పై ఖర్చులకు అయ్యే నాలుగు వందలు ఎక్కడ నుంచి తేవాలి? అన్న ప్రశ్న ఎదురయింది.

సాయంత్రం ఇంటి కెళ్ళగానే ఈ సమస్యను భార్య ముందుంచాడు. ఇది అదనపు ఖర్చులతో కూడుకున్న వ్యవహారం కాబట్టి ప్రస్తుతానికి విరమించుకుందాం అన్నాడు.

''అయ్యోరాత! అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురద గుంటలోకి లాగిందట! అట్లా ఉంది మీ ఆలోచన. జన్మలో ఎప్పుడైనా తెగించి ఫస్టు క్లాసులో ప్రయాణం చెయ్యగలమా ... ఇక మీరేమీ సందేహించ వద్దు'' అన్నది లక్ష్మి.

అప్పుడే బయట నుంచి వచ్చిన సుధాకర్ ''నాన్నా! ఎల్టీసీ!'' అని కళ్ళెగరేశాడు ప్రశ్నార్థకంగా.

''ఎల్టీసీ అంటే చాక్లెట్టో, మిఠాయో కాదు తేలిగ్గా తేవడానికి'' అని విసుక్కున్నాడు భూషణం.

ఉన్నట్టుండి భూషణానికి ఒక వింత ఆలోచన వచ్చింది. ఒక్కొక్క ఉద్యోగి మీద రెండు వేలు చొప్పున ఇన్ని లక్షల మంది ఉద్యోగుల మీద సంవత్సరానికి ఎంత సొమ్ము దుర్వినియోగ మవుతున్నది! ఇదంతా ప్రజల సొమ్ముకాదా!

తనొక్కడి క్రిందనే దాదాపు రెండువేల రూపాయల ప్రజాధనం ఎల్టీసీ పథకం క్రింద వ్యయమవుతుంది. ఆరుకోట్ల మంది ప్రజలలో సగానికిపైగా దారిద్ర్యపు రేఖకు దిగువ నుండి కనీస అవసరాలయిన తిండి, బట్ట, నీడ లేక అగచాట్లుపడుతూ ఉంటే తనలాంటి వారు ప్రజాధనం వెచ్చించి కుటుంబంతో విలాసయాత్రలకు వెళ్ళి రావడం న్యాయమా!''

ఆ మాటలే పైకి అనేశాడు, అంతే ...

''అటువంటి సన్నాసి మాటలు వినటాని కిక్కడెవరూ లేరు. ప్రజాధనంట, ప్రజాధనం. ఇట్లాంటి చేతగాని మాటలు ఇంకెప్పుడూ మాట్లాడకండి'' అన్నది లక్ష్మి. పిల్లలు కూడా తల్లినే సమర్థించారు.

గుక్క తిప్పుకోలేకపోయాడు భూషణం. తన ఆలోచనలు, ఆశయాలు సాగవని పూరుకున్నాడు.

ఎల్టీసీ మీద వచ్చే నెలలో కుటుంబంతో సహా



విశాఖపట్నం వెళ్ళిరావటానికి నిశ్చయించుకున్నాడు.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్ళి విశాఖకు ఎల్టీసీ మీద వెళ్ళేందుకు అనుమతి, శలవు, రెండువేల రూపాయల అడ్వాన్సు మంజూరు చేయమని ప్రార్థిస్తూ దరఖాస్తు పెట్టాడు.

అది తెలిసిన ఒక కవి మిత్రుడు భూషణాన్ని దగ్గరగా పిలిచి "నువు విశాఖ చూడటానికి వెళ్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందోయ్! విశాఖ అంటే ఏంటనుకున్నావ్! ... తెనుగుతల్లి తేనెమోవి, విరిసిన దరహాస రేఖ — మన విశాఖ, ఎత్తు పల్లపు బాటలు — పల్ల నెరుగని పాటలు, కార్మిక శక్తుల నెత్తిన జయపతాక — మన విశాఖ. అదేంటమ్మా... ఇంకా కొన్ని చరణాలు కూడా ఉండాల సమయానికి జ్ఞాపకం వచ్చి చావవు. పుస్తకం ఇంట్లో ఉండి పోయింది. చాలా సింబాలిక్‌గా రాశాన్లే" అని గుక్క తిప్పుకోకుండా వూదరకొట్టాడు.

ఆ విశాఖ జిల్లా అభిమానిని వదిలించుకుని బయట పడేటప్పటికి తల ప్రాణం తోక కొచ్చింది భూషణానికి.

వారం రోజులకు తన ప్రయాణానికి అనుమతి ఇస్తూ ఉత్తరువులు చేతికి అందినయి. మరో వారానికి రెండు వేలు అడ్వాన్సుకూడా చేతుల్లో పెట్టారు. పది పదిహేను రోజులు ముందుగా రిజర్వేషను చేసుకుంటే కాని గోదావరికి టిక్కెట్లు దొరకటం కష్టం అన్నారు. ప్రజా సేవకు భారత రైల్వేలను ముందుగా చెప్పుకోవాలి మరి.

ఇంటి కెళ్ళగానే తెలుగు కాలెండరు, పంచాంగం ముందేసు క్కూచుని భార్యను కేకేశాడు భూషణం. ప్రయాణానికి ఎప్పుడు వీలవుతుందో చెప్పమన్నాడు.

లక్ష్మి వేళ్ళమీద లెక్క పెట్టుకుని, కాసేపు భూషణం మొహంలోకి చూసి సందేహంగా మొహం పెట్టి, చివరికి పెద్దకూతురు రత్నని కేకేసి మెల్లగా అడుగుతున్నా ననుకుని పెద్దగానే అడిగింది.

"అవునే! ఆ రోజున. అదే పక్కింటి సుబ్బాయమ్మ మనింటికి కాఫీపొడి అప్పు కోసం వచ్చి గంట సేపు కూచుని వెళ్ళింది చూడు ఆ రోజే కదా నువ్వు స్నానం చేసింది!" రత్న వివరించింది.

రత్న అందించిన క్లూ ప్రకారం లక్ష్మి మళ్ళీ లెక్క వేసుకుని అమావాస్య వెళ్ళిన పంచమి అయితే వీలుగా ఉంటుందని తేల్చింది.


పంచమి ఏ తారీకుందో కాలెండరులో చూసిన రత్న "అమ్మో" అని గుండెం మీద చెయ్యి పెట్టుకుంది.

భూషణం, లక్ష్మి కంగారుగా కూతురివేపు చూశారు.

"ఆ రోజు నాకు క్లాసు పరీక్ష ఉంట కదా!" అన్నది రత్న.

"అమ్మయ్య" అని స్థిమిత పడ్డారు ఇద్దరూ. "ఇంకా ఏమిటో నని హడలి పోయాను" అన్నది లక్ష్మి వెన్ను చరుచుకుంటూ.

మొత్తానికి ఒక గంట సేపు తర్జన భర్జన అయిన తరవాత సుమారుగా ఏరోజు బయలు దేరితే బాగుంటుందో ఒక నిర్ణయానికి వచ్చారు.




వెళ్ళేది యాత్రలకు గదా, పైగా దూరాభారం. మంచి రోజు చూసి బయలుదేరితే మంచిది గదా అనిపించి భూషణం పంచాంగం తెరిచాడు. ప్రయాణమునకు ఆనందాది యోగములు అన్న పేజీ తీశాడు.

"శనివారము పునర్వసునక్షత్రము దాని కెదురుగా ఛత్రయోగము 28 దినములలోగా స్త్రీ లాభము, కమల దర్శనము అని పైకి చదివాడు.

"బాగానే ఉంది సంబడం. స్త్రీ లాభంట స్త్రీ లాభం! సోమవారం బాగుందేమో చూడండి" అన్నది లక్ష్మి.

"సోమవారం కాలదండ యోగం. అపశకునం లాభం లేదు. ఆ తరవాతి ధూమ్ర యోగం త్రోవ యందు సొమ్ము నష్టం, శ్రమ. ఇదీ లాభం లేదు. బుధవారం బాగానే ఉండేటట్లుంది. అయినా ఎందుకంయినా మంచిదని తన తారాబలంకూడా చూద్దామని తన జన్మ నక్షత్రం నుంచి వేళ్ళ మీద లెక్కగట్టి, నోట్లో గొణుక్కుని "విపత్తార అయింది ఆ రోజు" అని పెదవి విరిచాడు. ఇంకా వర్జ్యం, రాహుకాలం, దుర్ముహూర్తం చూడనే లేదు.

ఈ తతంగమంతా చూస్తున్న సుధాకర్‌కు అనుమాన మొచ్చింది. అసలు ఈ సంవత్సరం మనం వెళ్ళటానికి మంచి రోజు కుదురుతుందా అని. ఆ మాటే పైకి అనేశాడు.

భూషణానికి అయోమయంగా ఉంది. కొడుకు వేపు చూశాడు. "ఒకటి కుదిరితే ఒకటి కుదరటం లేదు. ఇవేవి చూడకుండా పట్టించు కోకుండా ఏదో ఒక రోజు బయలుదేరటానికి మనసొప్పటం లేదు.

"మన ఎదురింటి సుగుణ వాళ్ళ నాన్నగారుకూడా పంచాంగాలు చూస్తుంటాడు నాన్నా పోనీ ఆయన్ని చూసి పెట్టమను" అ సలహా ఇచ్చింది చిన్న కూతురు పద్మ.

ఎదురింటాయన ఇంట్లోనే ఉన్నట్లు గమనించి లేచి ఎదురింట్లోకి వెళ్ళి "ప్రయాణానికి మంచి ముహూర్తం చూడండి" అని ప్రాధేయ పడ్డాడు దీనంగా మొహం పెట్టి.

"దానికేముందండీ. రండి కూర్చోండి" అని భూషణానికి కుర్చీ చూపించి తను పంచాంగం తెచ్చుకుని ఎదురుగా కూచుని చకచకా పేజీలు తిప్పాడు. తను ఎల్టీసీ మీద కుటుంబంతో విశాఖపట్నం వెళ్ళదలుచుకున్నానని క్లుప్తంగా చెప్పాడు భూషణం.

ఎదురింటాయన ఒక తెల్ల కాగితం తీసుకుని పెన్నుతో దానిమీద నలచదరంగా గీతలు గీశాడు ఒక్కొక్క గడిలో ఒక్కొక్క గ్రహం పేరు పొడి అక్షరాలలో రాశాడు. కాసేపు వేళ్ళు లెక్క పెట్టాడు.

"చూడండి, భూషణంగారూ! వృషభంలో రాహువు, కర్కాటకంలో కుజుడు, సింహంలో రవి, కన్యలో బుధుడు, వృశ్చికంలో గురు—కేతువులు ఉంటారు. ఇకపోతే కన్య, తుల, ధనుస్సులలో చంద్రుడుంటాడు. మీ జన్మ నక్షత్రాన్ని బట్టి మీది వృశ్చిక రాశి కాబట్టి 9, 10 తేదీలు దూరపు ప్రయాణాలు చేస్తారనే సూచన కనిపిస్తుంది. సభలలో గౌరవం వగైరాలుకూడా సంభవం."

భూషణం వెంటనే అడ్డు తగిలాడు! "అయ్యా! తమరు నాకు వార ఫలాలు చెబుతున్నారా లేక ప్రయాణానికి మంచి రోజు చూస్తున్నారా!" అని.

ఎదురింటాయన ఒక్క చిరునవ్వు నవ్వి, "అదే చూస్తున్నాను, సార్! అంత తొందరయితే ఎలా చెప్పండి. అసలు ఈ జ్యోతిష శాస్త్ర ముంది చూశారూ. దీని దుంప తెగ. అగాధ మండీ. మీకు తెలుసో, తెలీదో కాని" అన్నాడు.

ఎక్కడ పోయి వచ్చి ఇరుక్కు పోయా నను కున్నాడు భూషణం.

"నాకు అంతగా తెలీదనుకోండి. కాని తెలిసినంత వరకు మాత్రం జ్యోతిష శాస్త్రం చాలా గొప్పదని ఒప్పుకుంటా. ఇంతకీ వచ్చే వారం ప్రయాణానికి అనుకూలంగాఉందంటారా!" అని అడిగాడు భూషణం.

ఏమనుకున్నాడో, ఏమో కాని ఎదురింటాయన గబగబా పంచాంగంలో పది పేజీలు తిరగేసి తను రాసిన కాగితంలోకి చూసి "వెళ్ళండి. ఏం ఫరవాలేదు. దివ్యంగా ఉంది. నేను చెప్పిన తారీకుల్లో బయలుదేరి వెళ్ళండి" అన్నాడు పంచాంగం మూసేస్తూ.

ఏ తారీఖులని అడిగితే మళ్ళీ జ్యోతిషశాస్త్రాన్ని గురించి ఉపన్య సిస్తాడని భయపడిన భూషణం కుర్చీలోంచి లేచి పరుగులాటి నడకతో బయటకు వచ్చి ఇంట్లో జొరబడి తలుపు మూశాడు.

అక్కడేమయినా గొడవ జరిగిందేమో నని భయ పడ్డారు ఇంటిల్లిపాది. "ఏం జరిగిందండీ!" అని దగ్గరి కొచ్చింది లక్ష్మి.

"ఇంత కాలంనుంచి ఎదురింటా యనతో పరి చయం లేకపోబట్టి బతికి పోయాం కాని, లేకపోతే పిచ్చెక్కి చచ్చి పోయుండను" అన్నాడు భూషణం తల పట్టుకుని.

"ఛా! అవేం అపశకునపు మాటలండీ!" అని కోప్పడింది లక్ష్మి.

"బుద్ధి వచ్చింది. ఇంక ఎవర్నీ సంప్రదించను ఈ విషయంలో. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడు రిజర్వేషను చేయించు కొస్తాను. తొమ్మిదో తారీఖున బయలు దేరుదాం" అన్నాడు భూషణం.

అందరూ గోడకు తగిలించిన కేలండరు వెంపు చూశారు. ఆ తరవాత 'సరే' నని తల లూపారు.

సాయంత్రం స్టేషనులో రిజర్వేషను ఫారం నింపి క్యూలో నిలబడ్డాడు. మెల్లి మెల్లిగా జరిగి కౌంటరు దాకా వెళ్ళి లోపలికి అందించాడు తన రాసిన ఫారాన్ని.

లోపల కూచున్నాయన ఫారాన్ని ముందు వెనకా రెండు సార్లు తిరగేసి పెదవి విరిచి "తొమ్మిదో తారీకుకు ఫస్టు క్లాసు అయిపోయినయి! కావాలంటే వెయిటింగ్ లిస్టులో ఇస్తాను. మీది ఇరవయ్యొకటో నెంబరవుతుంది" అన్నారు.

భూషణానికి ఏమీ తోచక ఫారం వెనక్కి తీసుకుని క్యూలో నుంచి బయటకు వచ్చి తీరుబడిగా బల్లమీద కూర్చున్నాయన్ని అడిగాడు. "ఇంత ముందు వచ్చినా టిక్కెట్లు లేకపోవట మేమిటి? వెయిటింగు లిస్టంటే ఏమిటి?" ఇత్యాది సందేహాలకు అనుభవజ్ఞుడయిన బల్లమీద కూచున్నా యన భూషణానికి సమాధానం చెప్పాడు.

ఆయన చెప్పిన దాని సారాంశం ఏమిటంటే ఏ రోజుకు ఖాళీలున్నాయని రైల్వే వాళ్ళు చెబితే ఆ రోజుకు టిక్కెట్లు కొనుక్కోవటం ఉత్తమ పద్ధతి అని, లేకపోతే రైళ్ళలో అందునా పిల్లా జెల్లాతో మనం అనుకున్న రోజున అనుకున్న తరగతిలో ప్రయాణం చేయాలనుకోవటం శుద్ధ పొరపాటనీ, అటువంటి ఆలోచన అత్యాశే అవుతుందనీను.

జ్ఞానోదయమయి భూషణం డబ్బున్న పాంటు జేబును ఒకసారి తడిమి చూసుకుని పట్టు వదలని విక్రమార్కుడిలా మళ్ళీ క్యూలో ఆఖర్ని నిలబడ్డాడు.